క్లుప్తంగా

ఘనంగా దర్గా ఉత్సవాలు



శాయంపేట : మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కరిమూల్లాసాబ్ దర్గా ఉత్సవాలు సోమవారం రాత్రి వైభవంగా జరిగాయి. మహమ్మద్ అక్బర్‌పాషా ఇంటి నుంచి జెండా, సందల్‌ను డీజే చప్పుళ్ల నడుమ గ్రామంలోని పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించి దర్గా వద్దకు తీసుకెళ్లారు. శాయంపేట, పెద్దకోడెపాక, పత్తిపాక, పరకాలకు చెందిన మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైలారం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో దర్గాకు తరలిరాగా పండుగ వాతావరణం ఏర్పడింది. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

బీసీ సమస్యలపై నేడు నిరసన దీక్ష

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల జనగణనపై స్పష్టత కోరుతూ, బహుజన వర్గాలకు తీవ్ర నష్టం చేస్తున్న ఈడబ్ల్యూఎస్, జీఓ 29 రద్దు కోరుతూ ఈ నెల 30న హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఒక రోజు నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ పూలే యువజన సంఘాల కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి తెలిపారు. దీక్షకు బహుజన, కుల సంఘాలు, అగ్రవర్ణ పేదలు, ప్రగతిశీల వాదులు, మేధావులు, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీసీ కమిషన్ పర్యటనలో బీసీలు పాల్గొనాలి

హన్మకొండ: బీసీ కమిషన్ బృందం పర్యటనలో భాగంగా నవంబర్ 2న హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీలంతా పాల్గొని అభిప్రాయాలు తెలపాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీల విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక స్థితిగతులను రాజకీయ పార్టీలకతీతంగా వివి ధ బీసీ కులాలు, సంఘాల డిమాండ్లను వినతి పత్రాల ద్వారా కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. పర్యటనలో బీసీ మేధావులు, బీసీ ఉద్యోగస్తులు, బీసీ విద్యార్థులు, బీసీ యువత, బీసీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

జైలర్‌కు అభినందనలు

వరంగల్: జైళ్ల శాఖలో ఉద్యోగంలో చేరి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న జైలర్ గొట్టె రామకృష్ణ సిల్వర్ జూబ్లీ వేడుకలను మంగళవారం వరంగల్‌లోని సబ్ జైలు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కేక్ కట్‌చేసి అభినందనలు తెలిపారు. డీఎస్పీ విజయడేనీ, జైలర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

లభ్యంకాని యువకుడి ఆచూకీ

హన్మకొండ చౌరస్తా: సరదాగా ఈత కొడదామని కెనాల్‌లో దూకిన యువకుడి ఆచూకీ ఐదు రోజులైనా లభ్యం కాకపోవడంతో కటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. హనుమకొండ పెద్దమ్మగడ్డకు చెందిన హనుమకొండ ఆదర్శ్ స్నేహితులతో కలిసి ఈ నెల 25న కెనాల్ వద్దకు వెళ్లారు. స్నేహితులు చూస్తుండగానే సరదాగా కెనాల్‌లో దూకాడు. వరద ఉధృతికి ఆదర్శ్ కొట్టుకుని పోయాడు. ఆదర్శ్ దూకిన సమయం నుంచి కొట్టుకుపోతున్న వీడియోను స్నేహితులు ఫోన్‌లో రికార్డు చేశారు. స్నేహితులు చూస్తుండగానే కొట్టుకుపోతున్న విషయాన్ని స్వయంగా పోలీసులకు తెలియజేశారు.

అవగాహన సదస్సు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని టాలెంట్ హైస్కూల్‌లో ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం రవీందర్ అధ్యక్షతన బాలల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ.. బాలబాలికలు సత్ప్రవర్తనతో పాటు సంస్కృతిక విలువలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాలబాలికలు ఏదైనా అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లకు 100,112, 1098, 181,1930 డయల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సుజాత, విద్యార్థుల పాల్గొన్నారు

ఆవిర్భావ వేడుకలు జయప్రదం చేయాలి

న్యూశాయంపేట : ఏఐటీయూసీ 105 ఏళ్ల ఆవిర్భావ వేడుకలు జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో జయప్రదం చేయాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా సమితి సమావేశం బాలసముద్రం కార్యాలయంలో జరిగింది. ఏఐటీయూ పోరాటంతో అనేక హక్కులు సాధించినట్లు తెలిపారు. నాయకులు రామ రాజేశ్‌ఖన్నా, సదానందం, రామూర్తి, రాజేందర్, పూర్ణచందర్, దుర్గాప్రసాద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మినీ బ్యాంకు సేవలు భేష్

- అన్నిరకాల లావాదేవీలకు అవకాశం
- మహిళా సంఘాలకు తీరిన బ్యాంక్ కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఖాతాదారులు



మినీబ్యాంకు సేవలను వినియోగించుకుంటున్న మహిళ సంఘం సభ్యులు

దామెర : బ్యాంకు సేవలు అందుబాటులోలేని గ్రామ ప్రజల సమస్యలపై దృష్టి సారించిన ఆయా బ్యాంకులు.. మీని బ్యాంక్ సేవలను (వినియోగదారుల సేవా కేంద్రాలను) అందుబాటులోకి తీసుకొచ్చాయి. దీంతో బ్యాంకు సేవలు ప్రజలకు మరింత చేరువ అవడంతో లావాదేవీలు సులభతరం అయ్యాయి. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ దామెర శాఖ మండలంలోని వివిధ గ్రామాల్లో మినీ బ్యాంకులను ఏర్పాటు చేసి సేవలందిస్తుంది. బ్యాంకు మిత్రలను బ్యాంక్ అధికారులు ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు.

బ్యాంకు మిత్రల ఎంపిక విధానం..

స్వయం సహాయక సంఘంలోని సభ్యులకు ఆసక్తి ఉండి, కంప్యూటర్ పరిజ్ఞానం, డిగ్రీ ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేస్తారు. అనంతరం గ్రామంలోనే ఒక సెంటర్‌ను ఏర్పాటు చేసి అన్ని రకాల బ్యాంక్ లావాదేవీలు జరిపేలా బ్యాంకు అధికారులతో ఒప్పందం కుదుర్చుకుంటారు. అనంతరం లావాదేవీలు నిర్వహించేందకు వీలుగా బ్యాంకుమిత్రలకు అధికారులు బయోమెట్రిక్ థంబ్‌ఇంప్రెషన్ మిషన్‌ను అందించి సేవలు కొనసాగిస్తున్నారు. దామెర మండల కేంద్రంతో పాటు ఒగ్లాపూర్, సింగరాజుపల్లి గ్రామాల్లో ఈ మినీ బ్యాంకులను ఏర్పాటు చేశారు.

అందుబాటులోకి లావాదేవీలు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన (బ్యాంకు మిత్ర) వినియోగదారుల సేవా కేంద్రాల ద్వారా బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయడం, నగదు డిపాజిట్, విత్‌డ్రా, ఉపాధి హామీ కూలీల డబ్బులు విత్‌డ్రా, నగదు బదిలీ, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, జీవన్ జ్యోతి బీమాకు సంబంధించిన లావాదేవీలు, రుణాల మంజూరు, చెల్లింపులు, విద్యుత్ బిల్లులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పెన్షన్ల పంపిణీ, మహిళా సంఘాల లావాదేవీలు వంటి సేవలను అందిస్తున్నారు. పాస్ బుక్ ప్రింటింగ్ సేవలు సైతం ఇటీవలే అందుబాటులోకి రావడంలో ఖాతాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సెంటర్ల ద్వారా రోజుకు రూ. 10వేలు విత్‌డ్రా చేసుకోవచ్చు. అదే విధంగా గరిష్ట పరిమితి లేకుండా డిపాజిట్ చేసుకోవచ్చు. బ్యాంక్‌కు వెళ్లి గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేకుండా, విత్‌డ్రా, డిపాజిట్ ఫామ్‌లు నింపాల్సిన అవసరం లేకుండా అధార్ కార్డుతో ఈ సేవలను నిమిషాల్లోనే పొందుతున్నట్లు ఖాతాదారులు తెలుపుతున్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాలకు సంబంధించిన లావాదేవీలు కోసం ప్రతినెలా సంఘం సభ్యులు అందరూ బ్యాంకుకు వెళ్లాల్సి వచ్చేది. కానీ ఈ మినీ బ్యాంకు సెంటర్ సేవలు అందుబాటులోకి రావడంతో ఇబ్బందులు తొలగిపోయాయని మహిళా సంఘాల సభ్యులు అంటున్నారు.

నిర్వాహకులకు కమీషన్లు

గ్రామాల్లోని మినీ బ్యాంక్‌ల నిర్వాహకులకు కమీషన్ల రూపంలో పారితోషకం చెల్లిస్తుంది బ్యాంకు. ప్రతీ నెల 150 లావాదేవీలు తప్పకుండా చేయాల్సి ఉంటుంది. అందకు కమీషన్ రూ.1,450 బ్యాంకు చెల్లిస్తుంది. కాగా ఒక్కో నిర్వాకుడు 150 లావాదేవీలకు పైగా చేసుకుంటూ ప్రతీ నెలా దాదాపు రూ.3,000 నుంచి రూ. 6,000 వరకు కమీషన్ వస్తుండడంతో ఉపాధి పొందుతున్నారు.

ఉపాధి పొందుతున్నాను..



మండల కేంద్రంలో వినియోగదారుల సేవా కేంద్రం ఏర్పాటు చేశాను. ప్రతి నెలా రూ.5,000 వరకు కమీషన్ వస్తుంది. బ్యాంక్‌కు సంబంధించిన అన్ని లావాదేవీలు చేసేందుకు అవకాశం ఉన్నందున రోజుకు 50 నుంచి 60 మంది వరకు ఖాతాదారులు వస్తున్నారు. ఇంటి వద్దే ఉపాధి పొందుతున్నాను.

- ఆలేటి రాధిక, బ్యాంకు మిత్ర, దామెర

సమయం కలిసి వస్తుంది



సంఘం డబ్బులు డిపాజిట్ చేసేందుకు గతంలో వరంగల్ బ్యాంకుకు వెళ్లాలంటే రోజంతా పట్టేది. కానీ గ్రామంలో మినీ బ్యాంకు ప్రారంభించినప్పటి నుంచి బ్యాంకు పనులు సులవుగా అవుతున్నాయి. బస్ ఛార్జీలు ఆదా అవడంతో పాటు సమయం కూడా కలిసి వస్తుంది. మినీ బ్యాంక్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.

- వర్నె రజిత, మహిళా సంఘం సభ్యురాలు

'ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ సహజం'



జ్ఞాపికను అందచేస్తున్న ఉపాధ్యాయ బృందం

ధర్మసాగర్: ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ సహజమని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ బాలుర పాఠశాల ఉపాధ్యాయురాలు భారతి ఉద్యోగ విరమణ పొందగా మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు భారతిని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడున్నర దశాబ్దాలుగా భారతి ఉపాధ్యాయ వృత్తిలో తనదైన ముద్ర వేశారని అన్నారు. వందల మంది విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ధర్మప్రకాశ్, శివసింగ్, రామచంద్రారెడ్డి, మల్లారెడ్డి, సురేష్, శిరీష పాల్గొన్నారు.

నవంబర్ 1 నుంచి కార్తీక మాసోత్సవాలు



దామెర : నవంబర్ 1 నుంచి కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని శివాలయం ప్రాంగణంలో మంగళవారం ఉసిరి మొక్కను నాటి మాట్లాడారు. నవంబర్ 1 నుంచి కార్తీకమాసం ప్రారంభం అవుతుందని, ప్రతి రోజు అభిషేకాలు, సోమవారం మహా రుద్రాభిషేకం, ప్రతి శుక్రవారం లలిత సహస్త్రనామ పారాయణం, దీపారాధన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. అదే విధంగా కార్తీక పౌర్ణమి రోజున లక్షదీపారాధన, తులసికల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల రాజుశర్మ, ఆలయ కమిటీ సభ్యులు సత్యవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

దామెర : వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటుహక్కు కోసం ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని పీఆర్టీయూ(టీఎస్) మండల అధ్యక్షుడు శరత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 6వ తేదీ లోగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులు కూడా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బాలిక అదృశ్యం

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో ఓ బాలిక అదృశ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. అక్కంపేటకు చెందిన బాలిక(17) మంగళవారం ఉదయం బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. తల్లిదండ్రులు పనులకు వెళ్లి తిరిగి వచ్చి చూసే వరకు కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు : మండలంలోని జగ్గయ్యగూడెం గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో 3 ఇసుక ట్రాక్టర్లు, మట్టిని కడిగి ఇసుకగా తయారు చేసే ఫిల్టర్ యంత్రాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లుపేర్కొన్నారు. వాహన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పెంచాల ఆగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అలాగే కడివెండి వీరన్న గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఇరువురి బాధిత కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కోగిల రవికిరణ్ కాలికి శస్త్ర చికిత్స కాగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఐనవోలులో..



ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన గబ్బెట మొండయ్య(70) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. మొండయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు గబ్బెట రాజయ్య, గండి రమేశ్, సిలువేరు కుమారస్వామి, హరిబాబు, కరిముళ్ల సంపత్‌రావు, గోపి, ఎల్లయ్య, రాజు, చేరాలు ఉన్నారు.

నియామకం



ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన అంకూస్ రాజును తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా కళాకారుల విభాగం కన్వీనర్‌గా నియమించినట్లు కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ పోశెట్టి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నియామకపత్రాన్ని అందజేసినట్లు అంకూస్ రాజు తెలిపారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి



నడికూడ : ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంతో పాటు చర్లపల్లి, నార్లపూర్, సర్వాపురం, ధర్మారం, రాయపర్తి గ్రామాల్లో గల పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయుల సమస్యపై సమావేశం ఏర్పాటు మాట్లాడారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వేలేరు : మండల కేంద్రంలోని వివిధ కిరాణషాపుల్లో గుట్కాలు అమ్ముతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. అమ్జద్, మణెమ్మ కిరాణషాపుల్లో రూ.1,690 విలువ చేసే గుట్కా ప్యాకెట్లు లభించగా సీజ్ చేసి సదరు యజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు



మాట్లాడుతున్న అక్తరున్నీసా

వేలేరు : సైబర్ క్రైమ్, నెట్‌వర్క్ హ్యాకింగ్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ అక్తరున్నీసా సూచించారు. మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు తప్పుడు మార్గాలను ఎంచుకుని సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అమాయక ప్రజల ఫోన్‌లకు కొన్ని లింక్‌లను, ఓటీపీలను పంపిస్తున్నారని అన్నారు. ఫోన్‌లు చేసి బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఓటీపీ, ఇతర వివరాలు అడిగితే నిరాకరించాలని అన్నారు. ఎవరైనా సైబర్ క్రైమ్, నెట్‌వర్క్ హ్యాకింగ్ బారిన పడితే 1930, డయల్ 100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జయసుధ, ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, బ్యాంకు అధికారులు వేదామృత, శ్రీకాంత్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారు

- కాంగ్రెస్ నాయకుడు రాజు



మాట్లాడుతున్న రాజు

ఎల్కతుర్తి : హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలుగూరి రాజు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పై మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ విమర్శలు చేయడం హేయమైన చర్య అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సతీష్‌కుమార్‌ను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి కోసం కనీసం శాసనసభలో గళం విప్పలేదని విమర్శించారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని మూడు ముక్కలుగా చేసిన చరిత్ర సతీష్‌కుమార్‌కే దక్కుతుందని అన్నారు. దళితుడిని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమించి సీట్లో కూర్చోబెట్టింది మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అని గుర్తు చేశారు. గౌరవెల్లి ప్రాంత ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న మంత్రి పొన్నంపై విమర్శలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్, సురేష్, రాజిరెడ్డి, నరేందర్‌గౌడ్, వీరస్వామి, కిశోర్, ప్రకాశ్, ప్రవీణ్, రాజు, సంపత్, హరికృష్ణ, సదానందం, ఫరీద్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్య తీసుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న గడ్డం రఘు

కమలాపూర్ : అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా సీనియర్ నాయకుడు గడ్డం రఘు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల చిగురుమామిడి మండలం తహసీల్దార్ కార్యాలయంలో తిరుపతిపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. కొందరు రెవెన్యూ అధికారులు డబ్బులకు అమ్ముడుపోయి అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ పత్రాలను తారుమారు చేసి ఇతరుల పేర్లు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది కోర్టు, చట్టాల పేరుతో పేద ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని అన్నారు. కొంత కాలం క్రితం తన రెండెకరాల భూమిని పట్టా చేయమని అడిగినందుకు ఎల్కతుర్తి తహసీల్దార్ తనను బెదిరింపులకు గురి చేశారని ఆరోపించారు. భూ బాధితుల సంఘం ఏర్పాటు చేసుకుని భూ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, బాధితులంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

'ఉపాధి హామీ'లో తప్పులకు తావివ్వొద్దు

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అడిషినల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు

ఎల్కతుర్తి : ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు తావివ్వొద్దని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. ముఖ్యతిథిగా ఆయన హాజరయ్యారు. 2023 నుంచి 2024 వరకు పంచాయతీరాజ్, ఫారెస్ట్ ఎమ్‌ఓఎమ్‌బీ మొత్తం రూ.4కోట్ల 62లక్షల పనులను ఉపాధి హామీలో కల్పించినట్లు తెలిపారు. కాగా అన్ని గ్రామాల్లో ఈనెల 14వ తేదీ నుంచి 28వ తేదీ వరకు తనిఖీ బృందాలు తనిఖీ చేసి సమర్పించిన నివేదికను ప్రజావేదికలో చదివి వినిపించారు. కొన్ని గ్రామాల్లో అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. మొత్తం 62వేలు అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఎంపీడీఓ వీరేశం, ఏపీఓ సాగరిక, అంబుడ్స్‌మెన్ నాగరాజు, సీనియర్ కంట్రోలర్ ఆఫీసర్ పుష్పలత, ఎస్ఆర్‌పీ కుమార్, ఏపీఓ కుమారస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలి

- వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్



ఆత్మకూరు : రక్తదానం చేసిన యువకులతో ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ సంతోశ్



శాయంపేట : రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్సై ప్రమోద్‌కుమార్



పరకాల : రక్తదానం చేసిన సీఐ క్రాంతికుమార్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న డీసీపీ రవీందర్

పరకాల : శాంతిభద్రతలతో పాటు ప్రజల సంరక్షణే ధ్యేయంగా ప్రతి పోలీస్ అధికారి పని చేయాలని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన 106 మందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమర వీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. వారి స్ఫూర్తితో ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, పరకాల, ఆత్మకూరు సీఐలు క్రాంతికుమార్, సంతోశ్, ఎస్సైలు పరమేశ్, అశోక్, ప్రమోద్‌కుమార్, పరకాల సబ్ డివిజన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు యువకుల రక్తదానం

ఆత్మకూరు : పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పరకాల డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆత్మకూరు మండల యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి తనుగుల సందీప్ ఆధ్వర్యంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. వీరిని ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ సంతోశ్ అభినందించారు. యువకులు సేవా కార్యాక్రమాల్లో ముందుండాలని సూచించారు.

రక్తదానం చేసిన నాయకులు

శాయంపేట : కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు సాదు నాగరాజు ఆధ్వర్యంలో 18 మంది యూత్ సభ్యులు రక్తదానం చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పరకాల సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని జీఎంఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్సై ప్రమోద్‌కుమార్ సూచన మేరకు రక్తదానం చేసినట్లు సభ్యులు తెలిపారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్స్ అందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని ఈ సందర్భంగా ఎస్సై సూచించారు. విద్యార్థులు, యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోలీస్ అమవీరుల త్యాగాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సంరక్షణకు పోలీస్‌శాఖ 24 గంటలు పనిచేస్తుందన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



ధర్మసాగర్ : మండలంలోని ఎల్కుర్తి కెఎం ఆగ్రో ఫౌల్ట్రీ ఫామ్‌లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు మంగళవారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించినట్లు పోలీస్‌లు తెలిపారు. మహ్మద్ జియా ఉల్ హఖ్ ఫౌల్ట్రీ ఫాంపై దాడులు చేపట్టగా 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు తెలిపారు. వాటిని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)